క్లుప్తంగా

స్నేహితుడికి ఆర్థికసాయం

నార్కట్‌పల్లి : మండల కేంద్రానికి చెందిన ఎలక్ట్రీషియన్ బత్తిని రవికి విధి నిర్వహణలో భాగంగా ప్రమాదవశాత్తు వెన్నెముక విరిగింది. విషయం తెలుసుకున్న ఆయనతోపాటు చదువుకున్న 1999–2000 విద్యా సంవత్సరానికి చెందిన 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు రూ.35 వేలను వైద్య ఖర్చుల నిమిత్తం గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో పసునూరి వెంకటేశ్వర్లు, రామకృష్ణ, లింగస్వామి, జానయ్య, సతీష్, యుగేందర్‌రెడ్డి, సైదులు, గణేశ్ తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా ఖాజా మొయిజుద్దిన్



చండూరు : చండూరు మున్సిపల్ కమిషనర్‌గా ఖాజా మొయిజుద్దిన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ మణికరన్ ఇటీవల సెలవుపై వెళ్లారు. వారం రోజులపాటు ఇదే కార్యాలయంలో మేనేజర్‌గా పనిచేస్తున్న ప్రభాకర్ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా బాధ్యలు నిర్వర్తించారు. రంగారెడ్డి జిల్లా జల్‌పల్లి మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఖాజా మొయిజుద్దిన్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యలు చేపట్టిన కమిషనర్ ఖాజా మొయిజుద్దిన్‌ను తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కమిషనర్ అసోసియేషన్ సెక్రటరీ సాబెర్ అలీ ఘనంగా సన్మానించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ : పట్టణంలో చేస్తున్న అభివృద్ధి పనుల కారణంగా శుక్రవారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జిల్లా విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కలెక్టరేట్ ఏరియా, అలకాపురి కాలనీ, హైటెక్ కాలనీ, మహిళా ప్రాంగణం, రామ్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

12న విశిష్ట సేవా పురస్కారాల ప్రదానం

నల్లగొండ టౌన్ : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 12న హైదరాబాద్ రోడ్డులోని విశ్వబ్రాహ్మణ విద్యార్థి వసతి గృహంలో వివిధ రంగాల్లో సేవలందించిన మహిళలకు విశిష్టసేవా పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ అధ్యక్షుడు దాసోజు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పెందోటు సోము తెలిపారు. గురువారం స్థానిక సంఘం కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 5వ తేదీ వరకు దరఖాస్తులను అందజేయాలన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

చండూరు : మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామంలో రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 5వ తేదీన కల్యాణం, 8న రథోత్సవం, 9న అగ్నిగుండాలు ఉంటాయని ఆలయ చైర్మన్ గజ్జెల కృష్ణారెడ్డి గురువారం తెలిపారు.

గీత కార్మికుడికి చేయూత

చిట్యాల : మండలంలోని గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన కల్లు గీత కార్మికుడు అంతటి శివలింగం ఇటీవల తాటి చెట్టు పైనుంచి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడి వైద్య చికిత్సకు కొండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా ఆధ్వర్యంలో సమకూర్చిన రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని గురువారం స్థానిక అసోసియేషన్ ప్రతినిధులు అందజేశారు.

ఎంఐఎం ఆవిర్భావ వేడుకలు



జెండా ఆవిష్కరిస్తున్న రజీయుద్దీన్

రామగిరి(నల్లగొండ) : ఆల్ ఇండియా మజ్లిస్ ఏ ఇత్తేహాదుల్ ముస్లిమీన్ పార్టీ ఆవిర్భావ వేడుకలు గురువారం నల్లగొండలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను జిల్లా అధ్యక్షుడు ఎండి.రజీయుద్దీన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ షేక్ మోయినుద్దీన్, కోశాధికారి గౌస్ మహ్మద్, జాయింట్ సెక్రటరీలు అబ్దుల్ మాలిక్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ఆందోళన

నల్లగొండ : టీఎస్‌పీఈ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం నల్లగొండ విద్యుత్ సర్కిల్ ఆఫీస్ ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో విద్యుత్ ఉద్యోగులు ఆందోళన చేశారు. జేఏసీ చైర్మన్ ఎస్.వెంకటయ్య, కన్వీనర్ ఏ.నాగిరెడ్డి కంపెనీ కో చైర్మన్ సురేశ్ కుమార్, బషీర్, రాజు, వెంకటేశ్వర్లు, ఫర్వేజ్, గిరి, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, ఏ.వెంకటేశం, రాంబాబు, సమ్మిరెడ్డి, బాలు, దీప్తి, ఉమ, సంధ్య పాల్గొన్నారు.

మహిళలకు సన్మానం

మర్రిగూడ : మండలంలోని యరగండ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. సర్పంచ్ మాడం శాంతమ్మ ఆధ్వర్యంలో మహిళా అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ముమ్మడి యశోద, ఉపాధ్యాయురాలు మాధవి, గ్రామ కార్యదర్శి పద్మ, ఏఎన్‌ఎం ఫైమీన్, వార్డు మెంబర్లు రాములమ్మ, పార్వతమ్మ, సంతోష, అంగన్‌వాడీ టీచర్లు రజిత, మమత, సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

వంట గ్యాస్ ధర తగ్గించాలి



నకిరేకల్ : ధర్నాలో మాట్లాడుతున్న ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్



కట్టంగూర్‌లో వంటావార్పు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



తిప్పర్తిలో ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు



కేతేపల్లి : నిరసన తెలుపుతున్న నాయకులు



శాలిగౌరారం : గ్యాస్ సిలిండర్లతో ర్యాలీ

నల్లగొండ రూరల్ : బీజేపీతో దేశ ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. వంటగ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ గురువారం కనగల్ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఐతగోని యాదయ్యగౌడ్, జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్, సహకార సంఘాల సొసైటీ చైర్మన్లు వంగాల సహదేవరెడ్డి, దోటి శ్రీనివాస్, బొర్ర సుధాకర్, నర్సిరెడ్డి, వెంకన్నగౌడ్, రేణుక, సైదులుగౌడ్, నాగరాజు, యాదగిరి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

తిప్పర్తిలో..

రామగిరి(నల్లగొండ) : కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచడాన్ని నిరసిస్తూ తిప్పర్తి మండల కేంద్రంలో జెడ్పీ ఫ్లోర్ లీడర్ పాశం రాంరెడ్డి ఆధ్వర్యంలో గురువారం బీఆర్‌ఎస్ నాయకులు గ్యాస్ సిలిండర్లతో నార్కట్‌పల్లి అద్దంకి రహదారిపై ధర్నా చేశారు. పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మీలింగారావు, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, రొట్టెల రమేష్, జాకటి మోషె, కందుల రేణుకలక్ష్మయ్య పాల్గొన్నారు.

నకిరేకల్‌లో..

నకిరేకల్ : గ్యాస్ సిలిండర్ ధర తగ్గించాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నకిరేకల్‌లో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ పాల్గొని మాట్లాడుతూ వంట గ్యాస్ ధరల పెంపును ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ మాద ధనలక్ష్మి నగేష్, పీఏసీఎస్ చైర్మన్ మహిందర్‌రెడ్డి, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు ప్రగడపు నవీన్‌రావు, సైదిరెడ్డి పాల్గొన్నారు.

కట్టంగూర్‌లో..

కట్టంగూర్ : వంట గ్యాస్ ధర పెంచడాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్ నాయకులు మండల కేంద్రంలోని ఈదులూరు రోడ్డుపై కట్టెలతో వంటావార్పు నిర్వహించారు. జెడ్పీటీసీ తరాల బలరాములుయాదవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏడుకొండలు, వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ పోగుల నర్సింహ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

చిట్యాల : కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ ధర పెంచడాన్ని నిరసిస్తూ గురువారం చిట్యాలలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, ఎంపీపీ కొలను సునిత వెంకటేష్‌గౌడ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పెద్దబోయిన సత్తయ్య యాదవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆవుల అయిలయ్య, ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లారెడ్డి, పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి జిట్ట చంద్రకాంత్ పాల్గొన్నారు.

కేతేపల్లి : కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధర పెంచడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు గురువారం ధర్నా నిర్వహించారు. స్థానిక ఎస్సీ కాలనీ సమీపంలో సర్వీసు రోడ్డుపై ఖాళీ సిలిండర్లు ఉంచి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, జెడ్పీటీసీ బొప్పని స్వర్ణలతసురేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు మాందాసు విజయరాణి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

రోడ్డెక్కిన బీఆర్‌ఎస్ నాయకులు

నార్కట్‌పల్లి : కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరను పెంచడాన్ని నిరసిస్తూ జెడ్పీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు మహిళలతో కలిసి గ్యాస్ సిలిండర్లతో నార్కట్‌పల్లి వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు మేకల రాజిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శంకర్, సర్పంచులు మాధవి, అశోక్‌రెడ్డి, బద్దం వరలక్ష్మి, రాంరెడ్డి, పుష్పలత, శంకర్, బాలకృష్ణ, భద్రాచలం, ఉపేందర్, సతీష్, విష్ణు, రామకృష్ణ, నాగరాజు, రవి, వెంకట్, కార్తీక్ తదితరులు ఉన్నారు.

శాలిగౌరారం : కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ల ధరను తగ్గించాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు మండలం కేంద్రంలో గురువారం ర్యాలీ, ధర్నా చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న గౌడ్, ఎంపీపీ గంట లక్ష్మమ్మ రాములు, మార్కెట్ చైర్మన్ మామిడి తేజస్వీ, వైఎస్ ఎంపీపీ కందుల అనిత తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి

నార్కట్‌పల్లి : ది నార్కట్‌పల్లి లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన భవనాన్ని గురువారం నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, బత్తిని ఉషయ్య, ఎంపీటీసీలు పాశం శ్రీనివాస్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, లారీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మంచిరెడ్డి రాజేందర్‌రెడ్డి, కార్యదర్శి ఎస్‌కె చాంద్‌పాష, కోశాధికారి వేముల భూపాల్, జిల్లా అధ్యక్షుడు గుండు నర్సింహగౌడ్, నార్కట్‌పల్లి అసోసియేషన్ అధ్యక్షుడు సామ యుగేందర్‌రెడ్డి, గౌరవాధ్యక్షులు పాశం సూరారెడ్డి, సామ కొండల్‌రెడ్డి, కార్యదర్శి పన్నాల నరేందర్‌రెడ్డి, కోశాధికారి పైళ్ల నర్సిరెడ్డి, ఉపాధ్యక్షులు పజ్జూరి సోమిరెడ్డి, పాశం వెంకట్‌రెడ్డి, జానకిరాములు, శ్రీను, సైదులు, ప్రవీన్‌రెడ్డి, అనిల్ తదితరులున్నారు.

సొంతంగా రోడ్డుపై మట్టి పోయించిన యువకులు

మర్రిగూడ : మండల పరిధిలోని తూర్పుతండాలో గుంతలమయంగా ఉన్న మట్టిరోడ్డుపై గురువారం ఆ తండాకు చెందిన శ్రీసిద్ధి వినాయక యూత్ సభ్యులు తమ సొంత ఖర్చులు సుమారు రూ.50వేల వ్యయంతో మట్టిని పోయించారు. ఎమ్మెల్యేతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా స్పందించలేదని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు అంబోతు భీమ్‌జీ, పాత్లావత్ రాజేందర్‌నాయక్, సక్ర, రవి, సుమన్, హరిప్రసాద్, బిచ్యానాయక్, గోపాల్, సుధాకర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

చిట్యాల : మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైయినేజీల పనులకు గురువారం నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య శంకుస్థాపన చేశారు. అనంతరం మండలంలోని పిట్టంపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు ఇరవై మంది ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొలను సునిత వెంకటేష్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, గుండ్రాంపల్లి, పిట్టంపల్లి గ్రామాల సర్పంచ్‌లు రత్నం పుష్ప నర్సింహ, వీసం బాబు, ఎంపీటీసీ దేవరపల్లి సత్తిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆవుల అయిలయ్య, యువజన విభాగం మండల అధ్యక్షుడు తుమ్మల నాగరాజురెడ్డి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ వితరణ

నల్లగొండ టౌన్ : జిల్లా క్షయ వ్యాధి నివారణ కేంద్రంలోని రోగులకు గురువారం లయన్స్‌క్లబ్ ఆఫ్ నల్లగొండ సభ్యుడు గోలి అమరేందర్‌రెడ్డి వాటర్ డిస్పెన్సర్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, చిలుకూరి రామకృష్ణ, సతీష్‌కుమార్, గట్టుపల్లి అశోక్‌రెడ్డి, యాదగిరి, అశోక్, సత్యనారాయణ, ఎల్‌వీ యాదవ్, రవీందర్ రెడ్డి, మోత్కూరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్ పంపిణీ



కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కంచర్ల

నల్లగొండ : ఛత్రపతి శివాజీ స్పోర్ట్స్ క్లబ్ ద్వారా రాష్ట్ర, జాతీయ స్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారులు తయారవుతున్నారని, ఇది మన జిల్లాకే గర్వకారణమని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మేకల అభినవ్ స్టేడియంలో దాతలు అందించిన 25 జతల ఫుట్‌బాల్ జెర్సీ కిట్లను క్రీడాకారులకు ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొమ్మపాల గిరిబాబు మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా ఛత్రపతి శివాజీ ఫుట్‌బాల్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో కోచ్ మద్ది కరుణాకర్ పర్యవేక్షణలో పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రభుత్వ హాస్టల్లోని విద్యార్థులకు ఔట్‌డోర్ స్టేడియంలో ఉచితంగా శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, ఫుట్‌బాల్ కోచ్ మద్ది కరుణాకర్ ఔట్‌డోర్ స్టేడియం డెవలప్‌మెంట్ కమిటీ ప్రధాన కార్యదర్శి షేక్ రహీం, జాయింట్ సెక్రటరీలు రాచూరి గణేశ్, అంబటి ప్రణీత్, కురుమిళ్ల భూపతి, బెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ అందజేత

నార్కట్‌పల్లి : మండలంలోని తొండల్‌వాయి గ్రామ యువతకు గురువారం గ్రామానికి చెందిన యువజన సంఘం నాయకుడు బింగి మహేష్ వాలీబాల్ కిట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో చింత శివశంకర్, మేడి రమేష్, చింత సతీష్, చింత మహేష్ తదితరులున్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న నాయకులు

నల్లగొండ : త్రిపుర, నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంపై గురువారం పట్టణంలోని గడియారం సెంటర్‌లో బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, వీరెల్లి చంద్రశేఖర్, పోతెపాక సాంబయ్య, మొరిశెట్టి నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

నకిరేకల్ : మండలంలోని మంగళపల్లి గ్రామ జెడ్పీ హైస్కూల్‌లో జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సబ్ జూనియర్స్ బాలుర జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 100 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 10 నుంచి 12 వరకు నిజామాబాద్‌లో జరిగే తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బాలుర హ్యాండ్‌బాల్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొంటారని హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చింత కాయల పుల్లయ్య తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు క్రీడా దుస్తులు, రవాణా చార్జీల నిమిత్తం రూ.14 వేల నగదును బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు బచ్చుపల్లి గంగాధర్‌రావు అందజేశారు. హెచ్‌ఎం సత్యనారాయణ, ప్రకాష్‌రావు, మోహన్‌రావు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

బేస్మెంట్లను కూల్చడం అన్యాయం

నల్లగొండ టౌన్ : పట్టణంలోని 11వ వార్డు పరిధి ఇందిరమ్మ కాలనీలో పేదలు నిర్మించుకుంటున్న ఇంటి బేస్మెంట్లను రెవెన్యూ అధికారులు నోటీసులు ఇవ్వకుండా కూల్చడం అన్యాయమని సీపీఎం నాయకులు దండెంపల్లి సత్తయ్య, సయ్యద్‌హాషం, ఎండీ సలీం, సరోజ అన్నారు. అధికారులు కూల్చిన బేస్మెంట్లను గురువారం వారు పరిశీలించి మాట్లాడారు. నంద్యాల నర్సింహారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్లాట్లు ఇచ్చారన్నారు. నాడు ఆర్థిక స్థోమత లేక ఇళ్లు నిర్మించుకోలేదని, నేడు నిర్మాణం చేసుకుంటుంటే అధికారులు కూల్చారన్నారు.

కంటి వెలుగు ప్రారంభం

మర్రిగూడ : యరగండ్లపల్లిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దంటు జగదీశ్వర్ గురువారం ప్రారంభించారు. సర్పంచ్ మాడం శాంతమ్మవెంకటయ్య, పంచాయతీ కార్యదర్శి పద్మ, ఏఎన్‌ఎంలు ఫైమీన్, అరుణ, రజిత, మమత, పార్వతమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ ధర పెంపుపై కమ్యూనిస్టుల నిరసన



నకిరేకల్ : దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

నల్లగొండ టౌన్ : పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ ఆర్టీసీ కాలనీ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని 42వ వార్డులో రోడ్డుపై సిలిండర్లు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు తుమ్మల పద్మ, పట్టణ కమిటీ సభ్యుడు గుండాల నరేష్, సహాయ కార్యదర్శి మాటూరు సునీత, జి పద్మ, వెంకటమ్మ, మాటూరు ఎట్టమ్మ, జయశ్రీ, స్వరూప, అంతమ్మ, విజయ, అక్షిత, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో..

గ్యాస్ సిలిండర్ ధర పెంపును నిరసిస్తూ చిట్యాలలో ఐద్వా ఆధ్వర్యంలో కట్టెల పొయ్యిపై వంట చేస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, కందుల అనిత, బొడిగె పూలమ్మ, జిట్ట రమాదేవి, మనీషా, యాదయ్య, అండాలు పాల్గొన్నారు.

మోదీ దిష్టిబొమ్మ దహనం

నకిరేకల్ : పెంచిన వంట గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని కోరుతూ నకిరేకల్‌లో సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీల, మండల, పట్టణ కార్యదర్శులు రాచకొండ వెంకట్‌గౌడ్, వంటెపాక వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ మర్రి వెంకటయ్య, నాగమణి, పన్నాల శశికళ, కంబాలపల్లి సోమయ్య పాల్గొన్నారు.

చండూరు : పెంచిన గ్యాస్ సిలిండర్ ధర తగ్గించాలని సీపీఐ మండల కార్యదర్శి నలపరాజు సతీష్‌కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు దోటి వెంకన్న, సీపీఐ నాయకులు బండమీద వెంకన్న, జెల్ల శ్రీను, దోటి యాదయ్య, దోమలు శ్రీను, భూతరాజు శీను తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీ అనుమతి రద్దు చేయించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మునుగోడు : మండలంలోని కిష్టాపురం గ్రామంలో ఫార్మా కంపెనీ అనుమతులు రద్దు చేయించాలని కోరుతూ అఖిలపక్ష పార్టీల, సంఘాల నాయకులు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులతోపాటు, వివిధ పార్టీల, సంఘాల నాయకులు హైదరాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకుని చర్చించారు. అనంతరం అక్కడికి వచ్చిన ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందించారు. కంపెనీ నిర్మాణ పనులు నిలిపివేయించాలని కోరారు. మంత్రితోపాటు సీఎం దృష్టికి తీసుకెళ్లి కంపెనీ అనుమతులు రద్దు చేయిస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, ఎంపీపీ కర్నాటి స్వామి, ఫార్మా వ్యతిరేక కమిటీ అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబం మరుగుదొడ్డి నిర్మించుకోవాలి

కట్టంగూర్ : ప్రతి కుటుంబం మరుగుదొడ్డి నిర్మించుకోవాలని ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ మరుగు దొడ్ల స్వచ్ఛ శిక్షణ తరగతుల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చలపతి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఏపీఓ కడియం రాంమోహన్, ఏపీఎం వినోద, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

వైభవంగా తిరుమలనాథ స్వామి రథోత్సవం

చిట్యాల : మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలో శ్రీ తిరుమలనాథ స్వామి కల్యాణోత్సవంలో భాగంగా గురువారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీ భూసమేత తిరుమలనాథ స్వామి ఉత్సవ విగ్రహాలను రథంలో ఉంచి భక్తులు ఊరేగించారు. నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, పూజర్ల శంభయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు అంతటి వెంకటేష్‌గౌడ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నర్రా మోహన్‌రెడ్డి, పేరేపల్లి, వట్టిమర్తి, వెంబావి, సర్పంచ్‌లు జనగాం రవీందర్‌గౌడ్, బుర్రి రవీందర్‌రెడ్డి, అద్దెల లింగారెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ మండల కో ఆర్డినేటర్ అద్దెల లింగారెడ్డి, మాజీ ఎంపీటీసీ కృష్ణ పాల్గొన్నారు.

విఠల్‌రెడ్డి కుటుంబానికి పరామర్శ

మర్రిగూడ : శివన్నగూడ సహకార బ్యాంక్ మాజీ చైర్మన్ కుదభాక్షపల్లి గ్రామానికి చెందిన మద్ది విఠల్ రెడ్డి సతీమణి కమలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. గురువారం ఆమె దశదిన కర్మకు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి హాజరై కమలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారివెంట ఎంపీపీ తదితరులు ఉన్నారు

ఉచిత వైద్యశిబిరం



మందులు అందజేస్తున్న సర్పంచ్ వెంకటేష్‌గౌడ్

చిట్యాల : మండలంలోని పేరేపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు గురువారం దివీస్ ల్యాబోరేటరీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు అంతటి వెంకటేష్‌గౌడ్ ప్రారంభించారు. పాఠశాలలోని 132 మంది విద్యార్థులకు డాక్టర్ శశిధర్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సులోచన, దివీస్ సీఎస్‌ఆర్ ఇన్‌చార్జ్ వల్లూరి వెంకటరాజు, ఎస్.సాయికృష్ణ పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో కాలువ పూడిక తీయించిన జెడ్పీటీసీ 'పాశం'




పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి

రామగిరి(నల్లగొండ) : తిప్పర్తి మండలంలోని రామలింగాలగూడెం, జంగారెడ్డిగూడెం, తానేదార్‌పల్లి, కంకణాలపల్లి, కొరివేనిగూడెంకు పానగల్లు ఉదయ సముద్రం నుంచి వెళ్లే డీ 39 కాలువ గేటు వద్ద బీఆర్‌ఎస్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పాశం రాంరెడ్డి తన సొంత ఖర్చులతో పూడికతీత పనులు చేయించారు. ఆయన వెంట రైతు బంధు మండల అధ్యక్షుడు ముత్తినేని శ్యాంసుదర్, రైతులు ఉన్నారు.

సాగునీటి పనులకు గ్రీన్ సిగ్నల్ !

- చండూరు మండల పరిధిలో ఫీడర్ చానల్ పనులకు మోక్షం
- ఆగిన పనులకు రీ ఎస్టిమేషన్ వేసే పనిలో అధికారులు



రీ ఎస్టిమేషన్‌కు శేషిలేటి వాగు ఫీడర్ చానల్‌ను పరిశీలిస్తున్న ఐబీ అధికారులు

చండూరు : మండల పరిధిలో ఆగిన సాగు నీటి ఫీడర్ ఛానల్ పనుల కొనసాగింపునకు ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ లభించింది. బుధవారం రాత్రి హైదరాబాద్‌లో మంత్రి జగదీశ్‌రెడ్డి చండూరు మండలంలోని శేషిలేటి వాగు, బెడలమ్మ చెర్వు, వెల్మకన్నె ఫీడర్ ఛానల్ పనులపై స్థానిక ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, ఐబీ అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఉప ఎన్నికలో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు అధికారులు పనుల్లో వేగం పెంచాలని సూచించారు.

భారీగా నిధులు..

ఆనాడు ధరలకు అనుగుణంగా ప్రకటించిన నిధుల ప్రకారం నేటివరకు నీటి సాగు పనులు జరుగకపోవడంతో ప్రస్తుతం పెరిగిన రేట్లకు అనుగుణంగా నిధులు పెంచాల్సి ఉంది. శేషిలేటి వాగు ఫీడర్ ఛానల్ పనులకు 2010 సంవత్సరంలో రూ.4.50 కోట్ల నిధులు కేటాయించగా, రీ ఎస్టిమేషన్‌లో రూ.12 కోట్లకుపైగా ఖర్చు అవుతుందని అధికారులు అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. వెల్మకన్నె ఫీడర్ చానల్ పనులకు 2012 సంవత్సరంలో కోటికి పైగా నిధులు కేటాయించగా, నేడు భారీగా పెరిగే అవకాశం ఉంది. బంగారిగడ్డ బెండలమ్మ చెర్వుకు 2006 సంవత్సరంలో రూ.కోటి 12లక్షలు కేటాయించగా, ప్రస్తుతం మూడు రెట్లు అధికంగా కేటాయించాల్సి వస్తుంది.

రైతులు సహకరిస్తారా..

భూములు కోల్పోతున్న రైతులు ప్రభుత్వం ఇచ్చే ధరలకు ఒప్పుకుంటారా లేదా అనేది కొంత మేరకు సందిగ్ధంగానే ఉంది. ఆయా గ్రామాల్లో జరిగే పనులకు ఆనాడు రూ.3 లక్షల నుంచి రూ.4.50 లక్షల వరకు ఎకరాకు అధికారులు నిర్ణయించారు. పనులు పూర్తయితే భూగర్భ జలాలు పెరుగుతాయని రైతులు సైతం ఒప్పుకున్నారు. ఏళ్లుగా పరిహారం అందకపోవడం ఓ కారణమైతే.. ప్రస్తుతం భూముల ధరలు పెరగడంతో రైతులు ఎలా స్పందిస్తారో చూడాలి.

ఆగిన పనులు..

- చండూరు మండల పరిధిలోని శేషిలేటి వాగు ఫీడర్ ఛానల్ పనులకు గతంలో ప్రభుత్వం రూ.4.5 కోట్లు నిధులు విడుదల చేసింది. 2010 సంవత్సరంలో పనులు ప్రారంభించారు. రైతులు కూడా 55 ఎకరాలు భూమి నష్టపోతున్నా భూగర్భ జలాలు పెరుగుతాయని ఒప్పుకుని పనులకు సహకరించారు. 70 శాతం పనులు పూర్తి కావొచ్చినా పరిహారం (ఎకరాకు రూ.4.50లక్షలు) ఇవ్వకపోవడంతో పనులను ఆపడంతో కాంట్రాక్టరు చేతులెత్తేశాడు. ఆనాటి నుంచి నేటి వరకు పనులు ముందుకు సాగలేదు. చేసిన పనులు కూడా ధ్వంసమయ్యాయి. కాంట్రాక్టర్ పనులు చేయనని అధికారులకు రాసి ఇచ్చాడు.
- బంగారిగడ్డ, నెర్మట గ్రామాల మధ్యలో ఉన్న బెండలమ్మ చెర్వు పనులకు 2006 సంవత్సరంలో ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి రూ.1.12 కోట్ల నిధులను మంజూరు చేసి పనులకు శంకుస్థాపన చేశారు. సంబంధిత కాంట్రాక్టర్ నాసిరకం పనులు చేసి రూ.80 లక్షలకు పైగా నిధులు తీసుకుని కనిపించకుండా పోవడంతో పనులు ముందుకు సాగలేదు. 22 ఎకరాలకు రైతులకు పరిహారం అందలేదు.
- వెల్మకన్నె ఫీడర్ ఛానల్ పనులు 2012లో ప్రారంభమయ్యాయి. అప్పటికే ప్రభుత్వం కోటి నిధులు మంజూరు చేసింది. 40 శాతం వరకు పనులు కొనసాగినా పరిహారం అందకపోవడంతో రైతులు పనులను ఆపేశారు.

మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇచ్చేలా చూడాలి



13 ఏళ్ల క్రితం కాలువ ద్వారా నీళ్లు వస్తే భూగర్భ జలాలు పెరుగుతాయని ఎకరానికి రూ.4.50 లక్షలు పరిహారం తీసుకునేందుకు ఒప్పుకున్నాం. కానీ పనులు చేయలేదు, పరిహారం ఇవ్వలేదు. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న ధరల ప్రకారం పరిహారం ఇచ్చేలా చూడాలి.

– మెందు చంద్రారెడ్డి, రైతు కస్తాల

నిధులు వెంటనే విడుదల చేయాలి



రీ ఎస్టిమేషన్ మేరకు వెంటనే నిధులు విడుదల చేయించాలి. పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం భూముల ధరల మేరకు రైతులకు పరిహారం ఇవ్వాలి.

– మేకల సాగర్‌రెడ్డి, కస్తాల